శక్తులున్నా లేకపోయినా మనమంటూ ఉన్నాం కదా! మన మీద మనం పూర్తి విశ్వాసంతో పని చెయ్యాలి కదా! మరి చేస్తున్నామా? ఈ అవసరమైన విశ్వాసాన్ని వదిలేసి ఆ అనవసరమైన విశ్వాసాన్ని పట్టుకుని మరీ మనల్ని మనం నిర్వీర్యుల్ని చేసుకుంటున్నాం. మత్తు జల్లి మనిషిని పరిస్థితులకు బానిసని చేస్తున్నాం. సస్పెన్సు కావాలంటే, మహానుభావుల జీవితాల్లోని సమస్యలూ వాటి పరిష్కారాలు లేవా? రక్తాన్ని ఉడికించి ఉడికించి హటాత్తుగా చల్లబరిచే చాణక్యనీతి కథల్లో ఎక్కడేట్చిందయ్యా అసలైన సస్పెన్స్ , మనిషి గుండె బద్దలు కొట్టి చంపటం తప్ప... పూర్ ఫెలో, ఐ పిటీ మిస్టర్ ఆచారి! ... ఇట్లా కొలాప్స్ అయిపోతాడనుకోలేదు!''

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 26-10-83)

*** *** ***

# నీశ్రాద్ధం పెడతా అనే 'అతి' కథ

" ఏవయ్యోయ్, రిటైరైన హెడ్ మాస్టరూ, నేనొచ్చేసాను, యముణ్ణి! నీక్కాలం తీరింది, వచ్చెయ్ పోదాం!''

" అయ, అయ, నమస్కారం. వస్తాను బాబూ. అతిగా ఏ అవయవానికా అవయవం శిథిలమైపోయున్న వాణ్ణి. మీరు రమ్మంటే రాకేం చేస్తాను!... కానీ బాబూ ఒక్క మనవి!''

" ఏంటది?... చెప్పెయ్'' ... " నేను పనిచేసే రోజుల్లో నాకింది బి.యిడి మాస్టరు క్లాసులకి సరిగ్గా వెళ్ళటంలేదని చిన్న చురక లాగ అతని కొక ఇంక్రిమెంటును ఆర్నెల్లపాటు ఆపుచేసాను. దాంతో వాడు అన్యాయంగా తన కడుపు మండించుకొని ఓ రోజు ఫస్టు పిరియడ్‌లో గబ్బిలాల మర్రిచెట్టు కింద నన్ను నిలేసి, - చూస్కో నీకు శ్రాద్ధం పెట్టి తీర్తాను!- అన్నాడు. అతగాడు ఆనాడు అతిగా రెచ్చిపోయి అట్లా అనటం నాకు బాధకలిగించింది కానీ, అయ్యా ఇప్పుడు నేను సంతానం గానీ దాయాదిగానీ లేని వాణ్ణి, కనక వాడిప్పుడు నాకు నిజంగా శ్రాద్ధం పెడితే బాగుండు ననిపిస్తోంది తమరు కాస్త ఓపిక చేసుకొని... ఆ కాస్త వివరమూ.. అతగాడి దగ్గర్నించి.. అందుకొచ్చారంటే .. మీకు ఋణపడుంటాను మీతో సంతోషంగా వచ్చేస్తాను.''

" ఏం లిటిగేషన్ మనిషివయ్యా !... సరే కనుక్కొస్తాన్లే!''

***

" ఏవయ్యా హెడ్ మాస్టరూ, నువ్వు బి యిడి అసిస్టెంటుగా ఉన్నప్పుడు అప్పటి నీ హెడ్ మాస్టరికి శ్రాద్ధం పెడతానన్నావట. నిజంగా పెడతావా? నువ్వా హామీ ఇస్తేనే గానీ నాతో రానంటున్నాడు ఏవంటావ్?''... " చిత్తం చిత్తం! యాభైఅయిదేళ్ల రిటైర్మెంటు సమ్మెట పోటుతో హఠాత్తుగా అతిగా పొటొచ్చి గుండె కొట్టుకోటం మా నేసిన వాణ్ణి! ఏకైక పుత్రుణ్ణి అమెరికాకు అర్పించుకున్న వాణ్ణి అయ్యా,

కుర్రాళ్లని 'లంజకొడకల్లారా!' అని అతిగా తిట్టాడని చిరాకేసి నా హెడ్ మాస్టరు హోదాలో నా కింది మాస్టరు కొహడికి మెమో ఇస్తే వాడు అతిగా విజృంభించి, నాకు తను శ్రాద్ధం పెట్టకపోతే తనొక తండ్రికి పుట్టనే లేదని స్కూల్లో ఆ మర్రి కిందే వున్న స్టేజి మీద శపథం చేసి పారేసాడు. మరి నా కతను నిజంగా శ్రాద్ధం పెడతానంటే సంతోషంగా నేను నా హెడ్ మాస్టరికి శ్రాద్ధం పెడతా. మళ్ళీ నా కోసం మీరొచ్చేసరికి నేను రెడీగా ఉంటా''

'' హార్నీ! మీ మాస్టర్లు భలే పురమాయిస్తారయ్యా పన్లు!... సరే కానీ, తప్పుతుందా మరి!''

★ ★ ★

'' చూడు మాస్టరూ, కుర్రోళ్లా ఉన్నావు. అయినా నేను రాక తప్పలేరు మరి! నీ హెడ్ మాస్టరికి నువ్వు శ్రాద్ధం పెడతానని స్టేజి మీదే శపథం చేసావుట. పెడతావా, చెప్పెయ్! నీ తాలూకు ఈ మాటకోసం నా కార్యక్రమం అంతా ఆపుకున్నాను.''... '' యస్సార్, యస్సార్! నా కున్న బలహీనం రోగం పక్షపాతాన్ని సర్రున వొంటి కెక్కించేస్తుందని అనుకోలేదు . అయ్యా నాకు అతి సంతానం! అందరూ ఆడపిల్లలే! పెళ్లికి మొహం వాచి ఉన్న వాళ్లే! మా స్కూల్లో చేరిన కొత్త ప్యూను, కాపీలందిస్తూంటే వాణ్ణి ఇన్‌స్పెక్టరుకు పట్టించానని, గబ్బిలాల మర్రికింద నన్ను నిలేసి- మీకు పెట్టి తీర్తానండోయ్ శ్రాద్ధం!'- అన్నాడు. అమాత్రానికి వాడు అంత హెచ్చుగా రెచ్చిపోతాడని నేనానాడు అనుకో లేదు. కానీ ఇప్పటి నా పరిస్థితిని బట్టి వాడు తానన్న మాటని నిలబెట్టుకుంటే బాగుండుననిపిస్తోంది. స్వామీ, ఆపద్బాంధవా, శ్రాద్ధదేవా, తమరెళ్లి వాణ్ణి కొంచెం కనుక్కొచ్చారంటే, నేను నా హెడ్‌మాస్టారి కోరిక ఆనందంగా తీరుస్తాను. ఆ తర్వాత ఏ అడ్డమూ చెప్పకుండా తక్షణం మీ వెనకాల మీ దున్నపోతు మీదెక్కేస్తాను!''

'' ఇవేం లింకులయ్యా బాబూ... మొత్తానికి తెలుగు మాస్టారివనిపించావు!... సర్లే కానీ!''

★ ★ ★

'' అంత అతిలోతుగా గొయ్యెందుకు తీస్తున్నారోయ్ చింతయ్యా? నీ పని స్కూలుకు బెల్లు కొట్టడమా మర్రికింద గొయ్యి తవ్వటమా!...

'' అశ్శరభ శరభ! ... యములోరా, నమస్కారం సామీ, ... నా నడుంమీద పెళ్ల యిరిగిపడింది. తమరొచ్చేత్తారని అనుకుంటానే ఉన్నాను. వొచ్చేసారు!''

'' సరే... నిన్ను ఇన్‌స్పెక్టరుకు అప్పగించినప్పుడు మీ మాస్టరికి నువ్వు శ్రాద్ధం పెడతానన్నావుట. అమాట ఖాయమేనా? నువ్వు ఊ అంటేనే గాని కుదర్దు ''

'' బాబూ ఈ యిస్కూల్లో పై వోడికి శ్రాద్ధం పెడతాననటం పెతికిందోడికీ మామూలైపోయిందండి. ఈ కోట దిబ్బలో ఉద్యోగాని కొచ్చిన కొత్తలో నాక్కూడా అతి ఊపొచ్చేసి, ఎవరో అనమన్నట్టు ముగ్గురికి అనేసాను 'నీ శ్రాద్ధం పెడతా' అని. ఆ తర్వాత నాలుగొకేసియన తగిలాడు.నేను, ఒక రేత్తిరేళ కూచుని 'ఏందిది పతివోడికీ పుణ్యవాలోశెన్లు ఇట్టాగ పెరిగి పోతన్నా యేటబ్బా! అసలీ దిబ్బలోనే యేదో తిరకాసుండాల! అని ఆలోసిచ్చుకున్నాను. యిస్కూలికి సెలవుల గదా అని మాపిటేలనుంచీ గొయ్యి తవ్వుతా వున్నాను. ఏదయినా కనిపిత్తందేమో మాత్రం అని!''

'' కనిపించిందా!'' ... ''ఇదిగో, ఇప్పుడిప్పుడే యీ రాగిరేకు బయటి కొచ్చిందండి. సదవమంటారా? 'నాగురువు నన్ను నీ శ్రాద్ధంపెట్ట' అని నా తప్పులేకుండా అతి తీవ్రంగా శపించాడు. కానీ నాకన్నా అతి ముందరగానే చనిపోయాడు. ఇప్పుడు నాకు శ్రాద్ధం పెట్టే వాళ్ళెవ్వరూ లేరు. ఆయన మళ్ళీ పుట్టినాకు శ్రాద్ధం పెట్టేటంత వరకూ ఏ పిశాచంగానో నేను అతి బాధల్లో వేళ్ళాడుతూండాల్సిందే గదా! ఎంత దారుణం!. కనక ఆ అధికార మదాంధత మీద, పైపదవిలో ఉండే వాళ్ల ఆ అతి అహంకార

రోగం మీద, నేను ప్రతి శాపం ఇస్తున్నాను. ముందు ముందు ఈ దిబ్బమీదకొచ్చే ప్రతి పెద్ద అధికారి తన కింద వాళ్ళచేత 'నీ శ్రాద్ధం పెట్ట' అనిపించుకొని తీరుకాక! ఆ శపించిన వాడు మరణించిన తర్వాత వాడిచేత శ్రాద్ధం పెట్టించు కోకుండానే ఆ అధికారి అతి ఆవేదనతో మరణించుగాక! నాది గురుశిష్యుల సంబంధం కనుక, నాశాపం -దిబ్బమీద వెలిసే విద్యాలయానికి మాత్రమే వర్తించుగాక! తథాస్తు! .. హ్రాం, హ్రీం.. హ్రూం ఫట్ -ఇట్లు భగభగ ముని' ...ఇదంతే బాబూ ఈ రేకు మీద రాత!... యములోరూ ఈ నడుం నెప్పి కాస్తంత సర్దుకున్నాక యింకా లోతుకి తవ్వియింకా యామయినా కనిపిస్తాయేమో సూస్తాను, సెలవిప్పిచ్చండి దొరా!"

" వీల్లేదు! అవతల నాకోసం జనం క్యూలో నిలబడున్నారు. అసలు నువ్వు ముందు నాతో పచ్చెయ్. అక్కడే ఆయనకి హామీ ఇద్దువుగానీ!... ఇదిగో విసుర్తున్నా పగ్గం!"

" ఏందయ్యోయ్ తలారిస్వామీ...! నేను అసలే అతి బిజీలో ఉన్నాను. పగ్గంగాని దించక పొయ్యావంటే నీశ్రాద్ధం పెట్ట అని శపించేత్తాను. నీ కన్నా ముందర నేను సచ్చిపొతాను గదా! అప్పుడు నీ గతేమవుద్దో ఆలోసించుకో. ఇప్పుడిక్కడ నేను గవర్మెంటోణ్ణి నీకన్నా పెద్దోణ్ణి. అదీ యిసయం... ఆ పగ్గందించేసి పారిపోకయ్యా! నడిచెల్లు పర్లేదు... అవునయితే నేను యములోర్నే దడిపించేసానేంటబ్బాః... అంటే యముణ్ణి గూడా ఈ దిబ్బమీద నుంచున్నావోడు తన్ని తగిలేత్తాడన్నమాట! భలే దిబ్బ! కృష్ణ కాలవగట్టు మీదున్న హైస్కూలు కోటదిబ్బ!"

(క్రోక్విల్ హాస్యప్రియ ఆగస్టు- సెప్టెంబరు '85)

★★★ ★★★ ★★★

# వొదిలేస్తావా?... నిజంగా?

## శనివారం రాత్రివేళ.

భార్యాభర్త లిద్దరూ ఇడ్లీ తింటున్నారు. సుందరికి పలక మారింది. తలెత్తి పైకి చూసి అరచేత్తో నెత్తి కొట్టుకొంది. " ఎవరో నన్ను తలుచుకుంటున్నట్టున్నారు, ప్రేమగా" అంది గోముగా.

" మరే, మరే, ఇంకెవరున్నారు నేనే!... అసలు నేను నిన్నెప్పుడూ తలుచుకుంటూనే ఉంటాను, చిట్టి! నా మనస్సులో ఎక్కడో మూల నువ్వెప్పుడూ ఆడుతూనే ఉంటావు తెలుసా? " అన్నాడు భర్త రాగనిధి. .. కనుబొమ్మలు ముడిచి సుందరి అంది, " ఏంటీ, ఎక్కడో మూలా? మనస్సు నిండా ఉండనన్న మాట!" నవ్వాడు రాగనిధి. " మనస్సు నిండా నువ్వే ఉంటే ఉద్యోగమెట్లా చేస్తాను? కంచంలోకి కూడెట్లా వస్తుంది?"

ఆమె మూతిని మూడు వంకర్లు తిప్పింది. 'హు' అంది... కాస్సేపటికి ఆమె అడిగింది " మజ్జిగివ్వనా?" ... " కాదు. పాలు" టక్కున సమాధానం.

ఆమె అలమార్లోంచి పాలు తెస్తూ " ఏం చూసుకునో ఆ ఫోర్సు! ఆ మాత్రం వూపు ఇతర్లక్కూడా ఉంటుందనుకోవాలి."

రాగనిధి తలెత్తి చూశాడు. సుందరి అతని కంచంలో పాలు పోసింది. పంచదార కూడా వేసింది